# ఏకాక్షరోపనిషత్తు

– డా. రామనాథపరిమి

**ఉపోద్ఘాతము :**

సర్వాత్మభావనను నిర్ద్వంద్వంగా ప్రకటిస్తూ ఆత్మవిద్యారహస్యాన్ని కరతలా మలకంగావిస్తూ నిష్ప్రతియోగికబ్రహ్మంలో పర్యవసించినటువంటి కృష్ణయజుర్వేద అంతర్గతమైన ఏకాక్షరోపనిషత్తు అనే ఈ దివ్యవాణి మానవాళి ఆత్మోన్నతే లక్ష్యంగా విజృంభిస్తోంది. ఈ ఆదర్శాన్ని మొట్టమొదటి నారాయణ స్తుతిశ్లోకంలోనే బయల్పరుస్తూ ఇలా అంటోంది.

ఏకమక్షరమైన పదం ఏదైతే ఉందో దాన్ని ఆరోహించినటువంటి సర్వాత్మకమైనటువంటి అఖండితమైనటువంటి సర్వమూ వర్జించిన కేవల చిన్మాత్ర స్వరూపమైనటువంటి త్రిపాదధారి (జాగ్రత్–స్వప్న–సుషుప్త్యాది అవస్థలలోనూ ద్రష్ట–దృక్–దృశ్యములలోనూ వ్యాపించినటువంటి) నారాయణునికి నమస్కారము.

ఈ స్తుతి గొప్ప మంత్రవాణి. ఆత్మజ్ఞానమూ భగవదభిజ్ఞా రెండూ ఒకటేనని నిరూపించి సంసారమనే అశాశ్వతమైన దుఃఖభూయిష్ఠమైన సమస్యను పరిష్కరించే ఓషధీమంత్రచయమిది. అందుకే ముందుగా ఆ సాధన ప్రతిపాదన అనేకమై నాశనమయ్యేటువంటి లక్షణం కలిగిన ఈ సృష్టికి ఆధారభూతమై ఉన్న తత్త్వము సదా ఏకమై, అక్షరమై ఉంది. ఆ తత్త్వమే సోముడిలోనూ, సుషుమ్నలోనూ దృఢీభూతమైంది. సోమశబ్దం చంద్రుడినీ, మనస్సునూ, ధాతువులనూ, అమృతత్త్వాన్నీ సూచిస్తోంది. శరీరంలో సుషుమ్న కుండలిన్యుత్థాన మార్గం. తద్ద్వారా సహస్రారచక్రంలో ధ్యానించబడేతత్త్వం. ఈ రెంటిలోనూ ఆ తత్త్వానికి దృఢత్వం ఆపాదింపబడడం చేత భగవత్తత్త్వం బలీయంగా ప్రకాశమానమై ఉందని తెలుపబడుతోంది.

నిర్విశేషచిన్మాత్రస్వరూపంగా భాసిస్తూ "**యదక్షరం పరం బ్రహ్మ, అక్షరం పరమం బ్రహ్మ త్రిపరిచ్ఛేదవర్జితం**" అని శ్రుతిస్మృతులతో పరిపాదింపబడుతున్నది ఏదైతే ఉందో అదే త్వం పదార్థమైన నీవు. ఇది గొప్ప ప్రతిపాదన. ఆ నీవు విశ్వమంతటికీ ఆధారభూతుడవై, పురాణుడవై, సర్వభూతపతివై, వర్షాత్మగా పర్జన్యస్వరూపుడవై, సమస్తాన్నీ రక్షిస్తున్నావు. అదే నీవు జీవులన్నిటిలోనూ జీవరూపంగా నిమగ్నుడవై ఉన్నావు. కవుల దృష్టిని ఆశ్రయించి నీవు విరాట్స్వరూపుడవై, జాతవేదుడవై, నిఖిల భువనాలకూ నాథుడవైయావు. అజాతుడవూ నీవే హిరణ్యరేత అయిన అగ్నివీ, యజ్ఞానివీ నీవే. విశ్వాధికరణమైన ఆత్మచేత నీవే పురాణుడవైన విభుడవు.

ఈ ప్రపంచాన్ని పుట్టించి గర్భంలో దాల్చిన నీవు సూత్రాత్మవై ముఖ్యప్రాణంగా ఉన్నావు. అదే విశ్వాన్ని ఏకపాదంతో వ్యాపించి ఉన్నావు (పాదోఽస్య విశ్వా భూతాని). నీవు విశ్వభూత్యోనిపరాసుగర్భుడ వైన విష్ణువు. (ఇది అమోఘమైన పదబంధం. దీనికి భాష్యమీవిధంగా ఉంది – **విశ్వస్య భూతిః విశ్వస్య యోనిశ్చేతి విశ్వభూత్యోనిః. స చాసౌ పరాసుః ముఖ్యప్రాణశ్చేతి విశ్వభూత్యోనిపరాసుః గర్భే యస్య సః విశ్వభూత్యోనిపరాసుగర్భః విష్ణుః** ఈ పదం చేత విష్ణువు ప్రతిపాదింపబడుతున్నాడు). అందులో నీవే కుమారుడవై జగచ్చక్ర నిర్వహణార్థం జనించావు. అందుకోసం బాణాలనూ ధనుస్సునూ ధరించావు. బాహ్యాంతఃకరణాత్మకమైన ధనుర్బాణాలను ధరించి తరుణార్క వర్ణంలో ఉన్నటువంటి అంతఃకరణాన్ని వ్యాపించి ప్రాణిపటలం యొక్క మాయాకార్యమయమైన వ్యోమ మధ్యంలో ప్రకాశించేటువంటి హిరణ్యగర్భుడ వీవు. అధిష్ఠాతవైన నీ చేత ఆకాశమందు ఉంచబడిన సూర్యుడు సర్వప్రాణులకూ చక్షురింద్రియానుగ్రాహకుడై ప్రకాశిస్తున్నాడు.

స్కందాత్మవైన నీవే కుమారుడవు. వైనతేయాత్మవైన నీవే అరిష్టనేమివి. ఇంద్రాత్మవైన నీవే వజ్రధారివి. భూతపతి అయిన రుద్రుడవు. చంద్రలోకంలో

ఉన్నటువంటి ప్రజలకు సన్నిహితుడవైన కాముడివి. ఋత్విగ్గణాలచేత వషట్కరింపబడేటువంటి స్వాహా, స్వధాకారుడవు నీవే. పశువులన్నింటిలోనూ అంతర్యామివై, నిమగ్నుడవై ఉన్నావు. ప్రాణధారణజీవస్వరూపుడవైన ధాతవు, విశ్వాన్ని సృజించేటువంటి విధాతవు. భూవరాహమవు గతివి, గాలివి, సుపర్ణుడవు, విష్ణుడవు, రాత్రింబవళ్ల రూపమవు భూతభవిష్యత్ప్రభావవంతమైన కాలరూపివి, కాలంలోని క్రియావిశేషానివి, క్రతువూ నీవే, పరమమూ అక్షరమూ అయిన స్వరూపుడవూ నీవే, ఎవని ముఖం నుండి ఋగ్యజుస్సామాలైన మంత్రాలుద్భవిస్తాయో అతడునీవే. సమ్రాట్టువు, వసువువు, యజ్ఞనేతవూ, అంతరిక్షానివీ నీవే. అష్టవసువులూ, ఏకాదశరుద్రులూ, దైత్యగణాలూ నీవే.

అంబరయాన చక్రమైన సూర్యమండలంలోనూ తదన్యప్రదేశమైన జీవకదంబంలోనూ తన అజ్ఞానజమైన తమస్సును నిరోధిస్తూ తిష్ఠవేసుకున్నది అతడే, హృదయవ్యోమాంతరంలో నిండి విరాజమానుడై ఎవడున్నాడో, బ్రహ్మాండ గర్భిణి అయినటువంటి మాయ ఎవడి నాభివంటిదై ఉందో, సూర్యాదిగతమైన రశ్మిజాలమంతా ఎవడి అంశనుండి జనించిందో, ఎవరి అంశయై ఈ జగత్తంతా హిరణ్మయమై ప్రకాశిస్తుందో అది అతడే. అతడు సర్వవేత్త, భువనరక్షకుడు, చరస్థిరాలైన ప్రజలకు జీవధాతురూపిణి అయిన నాభిని కలిగిన విష్ణ్వాత్మకుడు.

అంతర్యామివై ఓత ప్రోతమై ఉన్నది నీవే, నానాగతులకు విశ్రాంతివి నీవే, చతుర్ముఖుడవైన విష్ణుగర్భుడవు నీవే, ఛందోమయాంగుడవైన ప్రజాపతివి నీవే, ఋగ్యజుస్సామ మంత్రాల చేతకూడా తెలుసుకోలేని సహస్రబాహుడవూ, జ్యోతిర్మయుడవూ, వేదవిదులలో వరిష్ఠుడవూ, హిరణ్మయుడవూ అయిన నిన్ను బ్రహ్మవేత్తలు అధ్వరంలో ఋగ్యజుస్సామ మంత్రాలచేత స్తుతిస్తూ ఉంటారు.

స్త్రీ–పురుష–కుమార–కుమారీ భేదాలతో ఉన్నదినీవే. ధాతవూ, వరుణుడవూ, రాజువూ, వత్సరుడవూ, సూర్యుడవూ నీవే. ఇంద్రుడవూ, వరుణుడవూ, రుద్రుడవూ, విష్ణుడవూ, సూర్యుడవూ, గోపతివీ నీవే. దైత్యవర్గం నుండి భూతాలను రక్షించేది నీవే. భూ, భువ, సువ స్వరూపుడవు నీవే. నీవు విరాట్స్వరూపుడవైన స్వయంభూమూర్తివి విశ్వతోముఖుడవు. ఈ విధంగా నిన్ను ఎవడైతే తెలుసుకుంటాడో ధ్యానిస్తాడో అతడు బుద్ధిని అతిశయించినవాడై విదేహముక్తుడిగా ప్రకాశిస్తాడు అని ఈ ఉపనిషత్తు మనకు ప్రసాదిస్తున్న జ్ఞానఫలం.

ఉపనిషన్మాత మనకు చేసిన శస్త్రచికిత్స ఈ ఉపనిషత్తు. పరతత్త్వాన్ని వర్ణించడానికి ఇందులో ఉపయోగించబడిన ఒక్కో పదమూ ఒక్కో మందుగుండు. శ్రవణ–మనన–నిధిధ్యాసన పద్ధతులలో దీనిని సేవించిన వారికి  లభించే ఆరోగ్యమే జీవన్ముక్తి. సకల వేదాంతసారమైన ఈ ఏకాక్షరోపనిషత్తు ఏకమూ అక్షరమూ అయిన పరబ్రహ్మతత్త్వాన్ని బోధిస్తూ సార్థకనామధేయమై ప్రకాశిస్తోంది.

స్వస్తి

# ఏకాక్షరోపనిషత్

శ్లో. ఏకాక్షరపదారూఢం సర్వాత్మకమఖండితమ్ ।
సర్వవర్జితచిన్మాత్రం త్రిపాన్నారాయణం భజే ॥

ఓం సహ నావవతు సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**అథ ఏకాక్షరోపనిషత్ ప్రారంభః**

**హరిః ఓం**

ఏకాక్షరం త్వక్షరేఽత్రాస్తి సోమే సుషుమ్నాయాం చేహ దృఢీ స ఏకః ।
త్వం విశ్వభూర్భూతపతిః పురాణః పర్జన్య ఏకో భువనస్య గోప్తా ॥ ॥ 1 ॥

విశ్వే నిమగ్నపదవీః కవీనామ్ త్వం జాతవేదో భువనస్య నాథః ।
అజాతమగ్రే స హిరణ్యరేతా యజ్ఞైస్త్వమేవైకవిభుః పురాణః ॥ ॥ 2 ॥

ప్రాణః ప్రసూతిర్భువనస్య యోని ర్వ్యాప్తం త్వయా ఏకపదేన విశ్వమ్ ।
త్వం విశ్వభూర్యోనిపారః స్వగర్భే కుమార ఏకో విశిఖః సుధన్వా ॥ ॥ 3 ॥

వితత్య బాణం తరుణార్కవర్ణమ్ వ్యోమాంతరే భాసి హిరణ్యగర్భః ।
భాసా త్వయా వ్యోమ్ని కృతః సుతార్క్ష్య స్తవం వై కుమారస్త్వమరిష్టనేమిః ॥ ॥ 4 ॥

త్వం వజ్రభృద్భూతపతిస్త్వమేవ। కామః ప్రజానాం నిహితోఽసి సోమే ।
స్వాహా స్వధా యచ్చ వషట్ కరోతి రుద్రః పశూనాం గుహయా నిమగ్నః॥ ॥ 5 ॥

ధాతా విధాతా పవనః సుపర్ణో విష్ణుర్వరాహో రజనీ రహశ్చ ।
భూతం భవిష్యత్ప్రభవః క్రియాశ్చ। కాలః క్రమస్త్వం పరమాక్షరం చ ॥ ॥ 6 ॥

ఋచో యజూంశి ప్రసవంతి వక్త్రా త్సామాని సమ్రాడ్వసువంతరిక్షమ్ ।
త్వం యజ్ఞనేతా హుతభుగ్విభుశ్చ రుద్రాస్తథ దైత్యగణా వసుశ్చ ॥ ॥ 7 ॥

స ఏష దేవోఽమ్బరగశ్చ చక్రే అన్యేఽభ్యధిష్ఠేత తమో నిరుంధ్యః ।
హిరణ్మయం యస్య విభాతి సర్వమ్ వ్యోమాంతరే రశ్మిమివాంశునాభిః ॥ ॥ 8 ॥

స సర్వవేత్తా భువనస్య గోప్తా తాభిః ప్రజానాం నిహితా జనానామ్ ।
ప్రోతా త్వమోతా విచితిః క్రమాణామ్ ప్రజాపతిశ్ఛందమయో విగర్భః ॥ ॥ 9 ॥

సామైశ్చిదంతో విరజశ్చ బాహూమ్ హిరణ్మయం వేదవిదాం వరిష్ఠమ్ ।
యమధ్వరే బ్రహ్మవిదః స్తువంతి సామైర్యజుర్భిః క్రతుభిస్త్వమేవ ॥ ॥ 10 ॥

త్వం స్త్రీ పుమాంస్త్వం చ కుమార ఏకస్త్వం వై కుమారీ హ్యథ భూస్త్వమేవ ।
త్వమేవ ధాతా వరుణశ్చ రాజా త్వం వత్సరోఽగ్న్యర్యమ ఏవ సర్వం ॥ ॥ 11 ॥

మిత్రః సుపర్ణశ్చంద్ర ఇంద్రో రుద్రస్త్వష్టా విష్ణుః సవితా గోపతిస్త్వం ।
త్వం విష్ణుర్భూతాని తు త్రాసి దైత్యాంస్త్వయావృతం జగదుద్భవగర్భః ॥ ॥ 12 ॥

త్వం భూర్భువః స్వస్త్వం హి స్వయంభూరథ విశ్వతోముఖః ।
య ఏవం నిత్యం వేదయతే గుహాశయం ।
ప్రభుం పురాణం సర్వభూతం హిరణ్మయం ॥ ॥ 13 ॥

**హిరణ్మయం బుద్ధిమతాం పరాం గతిం స బుద్ధిమాన్బుద్ధిమతీత్య తిష్ఠతీత్యుపనిషత్**

ఓం సహ నావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఇత్యేకాక్షరోపనిషత్సమాప్తః**